# ముంపు

వానకాలమే.... అయినా ఎండ సుర సుర అంటంది. బొర్రెలు వాసిన భూమి గోంద్రికప్ప వీపు లెక్క పొక్కిలి పొక్కిలి కనవడ్తుంది. గుట్టల్ల రాత్రి పడ్డ ఎలగడ దగల్లు ఇంకా వూర్లె కత్తన్నయ్. పెద్దయ్య దేవుని కాడికి పొయ్యొచ్చిన రైతులకు అడియాసే మిగిలింది. ఈ యేడు సినుకు పడది. పాపం పాముల పుట్ట లెక్క పెరుగుతంది అని పెద్దయ్య దేవుడు జెప్పిన మాటలే అందరికి

యాదికత్తన్నయ్. నల్లమబ్బు కోసం మొగులు దిక్కు సూద్దామన్నా ఎండ సురసుర అంటనే వుంది. కప్పతల్లి ఆడ్తుండ్రు....

'కప్పతల్లి కప్పతల్లి కడుపునిండే
దోంతాల్ దొంతాల్ దొడ్లు నిండే
నాగండ్లకు పెయినోల్లు నవ్వుకుంటచ్చిరి
గుంటుకులకు పెయినోల్లు గుద్దుకుంటచ్చిరి... వానచ్చెనుర్రో..."

అని కేకలు పెడుతాండ్రు. రోకలి బండకి కప్పని కట్టి దాన్ని మోసుకుంట దప్పులసప్పుడు తోని ఇల్లిల్లు తిరుగుతుండ్రు. ఆడోల్లు బిందెలతోనో, చెంబులతోనో ఉన్నకాడికి నీళ్లు దెచ్చిపోత్తుండ్రు. కప్ప, రోకలిమోత్తున్న లింగడు, ఎంకడు తడిసి ముద్దయితుండ్రు. వాకిండ్లన్ని బురద బురదైపోతున్నయ్... పగటి పూట బడి ఎగ్గొట్టిన పోరగాల్లకు అది పండుగే అయింది.

గొర్లకాడికి పోతున్న రాయలింగు తీగురంగ అన్నడు...

"కాలం పోనేవాయె... ఇగ మీరు కప్పతల్లి ఆడితే వానలు పడుతయ్ తీయుండ్రి"

ఎంకడికి ఆ మాట ఇనంగనే బుస్సున కోపమొచ్చింది.

"ఆటోడాటోడేటేటు వాయె..." అన్నాడు

"పీతిరికుంట్లకు పియ్యి దినవాయె..." లింగడు అందుకున్నడు ముసి ముసిగ నవ్వుకుంట. రాయలింగు ఏదో తిట్టుకుంటవోయిండు.

గుంపు అచ్చుతరావ్ దొర ఇంటిముందుకచ్చి ఆగింది.

అప్పటికే అయిదారుగురు పెద్ద మనుషులు గచ్చుమీద కూసున్నరు. అందరు మౌనంగున్న అక్కడున్నోల్ల మొఖాలమీద ఏదో బాధ కన్పడింది. బడి

పోరగాండ్లు అక్కడ సెప్రాసిని జూసి గొర్రగొర్ర గుంజుకపోతడని తెల్సి ఉరికింద్రు. దప్పుల చప్పుడాపి అందరు కూలబడ్డరు.

లింగడు రోకలి గోడకారిగిచ్చి "నీయవ్వ... కప్ప సచ్చిపోయినట్టుందే" అన్నడు నవ్వుకుంట. "మనుషులే చస్తంద్రు... ఇగ కప్పలకచ్చింది తియ్..." ఓ పెద్దమనిషి నిట్టూర్చాడు.

"పొద్దుగాల్నుంచి మున్నూరు గడప తిరిగినం... తడిసి తడిసి చలిజెరం అచ్చేటట్టుంది గట్లనవడ్తివేందే" అన్నడు ఎంకడు తల దులుపుకుంట.

"సరెగనీ... ఏందే... సచ్చిన పీనుక్కాడ కూసున్నట్టు అందరు కట్టగట్టుకొని గిట్ల కూసున్నరు" అడిగిండు లింగడు.

ఓ పెద్దమనిషి గంభీరంగా చెప్పాడు.

"దొర వూర్లోంచి ఎళ్లిపోవుటానికే తమాం జేసుకున్నడట"

ఎందుకు... ఎందుకు... అన్న గుసగుసలు... పైకి చెప్పలేని సమాధానం ఎవలకాల్లు సోచాయించుకున్నరు.

మొన్న గొరుకోలు సుక్కలు పాడిసేయాల్లకి అన్నలొచ్చి ఊరిడిసి పొమ్మన్నరట...

అప్పుడే వచ్చి అచ్చుతరావ్ దొర బట్టకుర్చీల చిన్నబోయి కూసున్నడు. ఏం మాట్లాడతలేడు. ఉలుకులేదు... పలుకులేదు... మరో ఇరవైమంది జమైంద్రు.

ఓ పెద్దమనిషి ధైర్నం తెచ్చుకొని అడిగిండు.

"పట్నం ఎల్లిపోవాలని ఎందుకనుకుంటుంద్రు...."

దొర మాట్లాడలేదు...

"మీరు వోతె గడి పాడువడ్తది... దసరాకి యాటని కోసుడు గిక్కన్నేనాయె... ఊరంత పెత్తరీగలు పడ్డట్టయితది. గొడ్డు గోదా క్యాలి తప్పినట్లయితయ్..." గొంగడి పర్సుకొని కూసున్న రట్నయ్యన్నడు.

దొరమీద జెట్టక్క కూసున్నటు ఏం మాట్లాడలే...

"మంద మీద తోడేలు వడ్డట్టు ఆగమాగమైతది... మీరు అందరు దొరల్లెక్క ఇషపాత్క పోల్లు కాదు. అందరు పట్నాల పొంట వోయిన మీరు గిక్కన్నే వున్నారు. అవ్‌గానీ... మాకో మతులావ్ తెల్సింది. అన్నలచ్చింండ్రట... మిమ్మల్ని ఊరిడిసి పెట్టుమన్నరట... మీరు సెప్తలేరు.. మేమే అన్నల్ని పోయడుగుతం..." అన్నడు సుతారి రాజయ్య.

దొర గప్పుడు జెల్దరిచ్చినట్టు అన్నడు.

"వద్దు... వద్దు... అంతపని చెయ్యకుండ్రి. అన్నలకి చెప్తే నామీదొట్టే... మిమ్మల్ని అప్పుడప్పుడు చూస్కోవడానికన్నా నేను బతికుండాలంటే పట్నంపోక తప్పది... పబ్బతి వడతన్న... అర్థం చేసుకోండ్రి..." అని దీనంగ చేతులెత్తి మొక్కిండు.

దొర గట్ల మొక్కేటాల్లకు అందరి కండ్లల్ల నీల్లు తిరిగినయ్.

కొందరిల బాధ... కొందరిల సంతోషం... ఇంకొందరిల ఏదో అనుమానం... అంతా నిశ్శబ్దంగా వుండిపోయిండ్రు.

"ఉత్తచేతుల్తో పట్నంబోయి నేనెట్ల బతకాల్నో నాకే సమజైతలేదు. ఊరు ఇడిసి పెట్టుడంటే పెండ్లాన్నిడిసి పెట్టినట్టె... నాకంత వడ్లు పెరుగు కలుపుకున్నట్టుంది... పట్నంబోతే తఖ్లీఫయితది. కని తప్పేటట్టు లేదు. నాకున్న నూట ఇరవై ఎకరాలు అమ్మేద్దామనుకుంటున్న. మీకు తెల్సు... నక్సలైట్లు జెప్పకముందే నేనండ్ల ఎవుసం బంజేసిన. అందుకే నన్ను పాణాల్తోని ఇడిసిపెట్టిండ్రు.

అగ్గాకో సగ్గాకో గిప్పుడు వాటిని అమ్మేత్త... అది మీకే... మీకు తెల్సు... మానూర్లె ఎకరానికి లక్ష రూపాయల ధరుంది. కాని మీ దగ్గర లాభాలు దీస్కోని నేనేం సుకపడ్త. గందుకే రేటుని మీరే నిర్ణయించుండ్రి. నా గ్రామస్తులకు నేను నా భూముల్చిన అనే తుర్తితో నన్న పట్నం పోత... ఎకరాన ఎంతిస్తరో మీరే జెప్పుండ్రి. రానికాడ రాయి అన్నట్టు గదే బంగారమనుకుంట..." అన్నాడు.

గా మాటతో జనం నిమిషం సేపు మొస పీల్చుకోలె. అటెనుక మొఖాలు చూసుకున్నరు. మెల్లగ కలకలం రేగింది.

అందిరి గుండెల్లోనూ ఏదో ఆశ బుస బుస పొంగింది.

చెరువు కింది పొలాలు... కట్ట మైసమ్మ కాడి పొలాలు... నల్ల పోచమ్మకాడి పొలాలు... శార భూములు అన్నీ యాదికచ్చినయ్...

ఎవలకాల్లు కమస్కమ్ రెండెకరాలన్న కొనుక్కోవాలె అని ఆశపడ్డరు. బంగారం పండే భూములవి... అప్పో సప్పో చేయ్యాలె... ఇంట్ల ఆడోల్ల మీద తులమో మాసమో అమ్మయినా సరే... దొర భూమి కొంత కొనుక్కోవాలె... మనసారా ఎవ్సం జెయ్యాలె.. పట్టెడన్నం తినాలె...

అందరిలోనూ ఆశ పెరిగింది.

ఎకరాన లక్ష రూపాయలున్న భూమి... దొర ఎంతకిత్తడు?

"మీరే చెప్పుండ్రి దొర... ఎకరాన ఎంతియ్యుమంటరు" అన్నారు నలుగురైదుగురు. "చెప్పటానికి నాకు నోటి మాటత్తలేదు... మీరెంతిస్తే గంతే దీస్కుంట. గట్లని ముంచకుండ్రి... మీ బుద్ది... పొద్దుగూకంగచ్చి చెప్పుండ్రి..." అని లోపలికెల్లిపోయిండు.

క్షణాల్లో ఈ విషయం వూరంతా పాకిపోయింది.

అందరు కచ్చీరు దగ్గరికి చేరింద్రు.

ఎంతియ్యాలి... ఎంతియ్యాలి... గంటసేపు తల్లడమల్లడమయ్యింద్రు.

"లక్ష రూపాయలు ఇలువైనదానికి ఎకరాన డెబ్బయ్ వేలన్న ఇయ్యకపోతే ఇమానముంటదా" ఓ రైతు చెప్పిండు.

అందరి మనుషుల్ల నిరాశ కల్గింది ఆ మాటతోని. ఓ నడివయసు రైతు కూలీ అన్నడు.

"ఎప్పట్నించో ఓ రెండెకరాల్నయినా కొనుక్కొని రైతుగా బతుకాల నుందయ్యా... నాకే గాదు. మనూర్లె శానామందికి ఆ కోరికుంది. ఎకరాన యాభైవేలు ధరజేసి దొరని ఒప్పించుండ్రి. ఎల్లెంబీ బేంకుల అప్పుదెచ్చన్నా తలా రెండెకరాలు కొనుక్కుంటం...

మళ్లా వాదోపవాదాలు జరిగాయి.

"ఎట్లయినా అమ్ముతానన్నడు గదాని యాభైవేలకు, ఇరవై వేలకు అడిగితే ఏం మంచిగుంటది. ఎకురాన ఎనభై వేలిద్దాం" అన్నడు పట్వారి కొడుకు.

కొంచెం రేటు పెంచయినా సరే ఎక్కువ భూములు కొనాలని అతడి ప్లాను.

"ఎకురాన ఎనుభై వేలంటే ఎవలు కొంటరు? ఎకురాన యాభై వేలయితే అప్పో సప్పో జేసి కొంటం..." ఎక్కువ మంది గిదే మాటన్నరు.

దీపాలు పెట్టే యాల్లకి కొంచెం భయం భయంగానే దొర దగ్గరికి చేరి విషయం చెప్పింద్రు. దొర మొఖంల ఏదీ కన్పించలే..

"సరే మీ ఇట్టం... నా గ్రామస్తులకు ఇచ్చిన తుర్తి నాకుంటది. ఎకురాన

యాభైవేల లెక్కన పైసల్ జమ చేసియ్యుండ్రి. రెండ్రోజుల్ల రిజిస్ట్రేషన్ జెత్త. ఎల్లుండే నా ప్రయాణం" అన్నాడు.

దొర ఒప్పుకునే సరికి ఊరంత ఆనందంల మునిగిపోయింది. ఊహించని అదృష్టానికి మురిసిపోయిన రైతులు ఇంట్ల బంగారం అమ్మిండ్రు... మూడు కొత్తల మిత్తికి అప్పులు దెచ్చిండ్రు... ఇండ్లు కుదవెట్టి బ్యాంకుల్ల దెచ్చిండ్రు.

అంతా కల్సి... అరవై లక్షలు !

గఢీలకి రిజిస్ట్రార్ని, ఎమ్మార్వోని, ఆరైని, పాత పట్వారిని పిలిచి అందరి పేరున రిజిస్ట్రేషన్ చేసిండు.

అదేరోజు సాయంత్రం... వూరందరి దగ్గర... భారంగ సెలవుదీసుకొని అరవై లక్షల రూపాయలు డి.డి. తీయించుకొని కార్లో పట్నం బయల్దేరిండు. దేవున్ని సాగనంపినట్టు అందరు దండం పెట్టిండ్రు. కొందరు కాల్లు మొక్కిండ్రు.

కారు పొలిమేర దాటి నేషనల్ హైవే మీదికచ్చింది.

కార్లో రిలీఫ్గా కూచొని చిద్విలాసంగా నవ్వుకున్నడు. సెల్ఫోన్ తీసి నెంబర్లు ఒత్తి... "బామ్మర్దీ... గొప్ప సాయం జేసినవ్ బిడ్డా... ఇప్పుడే బయల్దేరిన..." అన్నడు.

దొర ఎంత ఇకమతులోడో తెల్వక ఊరు అమాయకంగా నిద్రవోయింది.

xxx xxx xxx

ఆర్నెల్లన్న తిరుగలేదు...

ముంగాలి పంట చేతికందచ్చింది. పొలాలు కోసుటానికి కైకిలోల్లకు పానం దరిత్తలేదు... గంత ఏపుగ పెరిగినయ్....

పసురాలకు, పచ్చగడ్డికి, అరిగడ్డికి రెండేండ్లయినా ఢోకాలేదని రైతులు సంబుర పడ్డరు.

ఏగిలివారంగ పొలం కోత వట్టుటానికి కొన్ని కోద్దామని పట్టుకెళ్తున్న బుచ్చిరెడ్డి హోటల్ దగ్గరాగిండు ఛాయ్ తాగుదామని...

"పొలచ్చినాయెూయ్ కైలాసం... చాయ్ పెట్టిత్తవా..." అని బెంచిమీద కూసున్నడు. కోడి కాళ్లకు సుతిలి కట్టుట్ల గింజుకుంటుంది. దాన్ని మూలకు ఒరిగిచ్చిండు.

కైలాసం సిలిండరు మీద ఛాయ గిన్నె పెట్టుడు జూసిన బుచ్చిరెడ్డి...

"నీ పెండ్లానికి స్వశక్తి గ్రూపులచ్చినాదోయ్ సిలిండరు. మొన్నటిదాక గిరుకపొయ్యిమీద జేత్తివి గద" అన్నడు.

"సరేగని... ఫారపు కోన్ని పట్టుకపోతున్నవేందే... గడ్డి తిన్నట్టె వుంటది కాదె దాని కూర... నాటుకోడి దొరుకలేద..." అనడిగిండు.

"మాట మార్తివి... నీ సిలిండరు గుంజుకపోతనా... అవ్‌గనీ గా ఫోటువ అవల్దార్‌గ దిగింద్రు... సూటు బూటేసుకొని... ఎవలాల్లు" అన్నడు బుచ్చిరెడ్డి.

"మా నడిపి బామ్మర్ది... మస్కట్ వోయిండె. తులానికి రెండు తులాల లెక్కన నేనే ఇచ్చిన. ఇగ ఆడు ఆల్ల అక్కకు బంగారం పంపుకుంట గా ఫోటువ పంపిండు" చెప్పిండు కైలాసం.

"నీయక్క మస్కటంటె యాదికచ్చిందోయ్... గీ మన దట్బూర్ లింగరావ్ దొర లేకుండెనా గాయినె కూడా గిట్లనే మస్కట్‌వోయి హోటల్ల జీతమున్నడట. ఆ వూరి మాదిగి నర్సిగాడు కూడా మస్కట్లనే వుండె. ఎనుకట ఆల్ల పాలేరోడు. ఓసారి ఆడు గదే హోటల్‌కు పోయిండట.. ఇగేముంది. దొర ఛాయదెచ్చిచ్చిండు.

మాదిగి నర్సిగాడు దొరిని జూసి ఒకటే నవ్వుడనుకోరాదు... దొరకి ఆన్ని సూడంగనె పంచెడు పాణాలు పోయినయ్... మానూర్లె జెప్పకురా... నీ దండం పెడతా అని ఒకటే బతిమిలాడుడట..." అని లగాంచి నవ్విండు బుచ్చిరెడ్డి...

కైలాసం నవ్వి చాయ్ గిలాస దెచ్చి ముందట వెట్టిండు.

గప్పుడే ఓ పొల్లగాడు పేపరేసి పోయిండు.

పేపరందుకున్న బుచ్చిరెడ్డి... హెడ్‌లైన్ చదివి అదిరిపడ్డడు.

వెన్నుముకలకెల్లి చలి పాకింది. కండ్లల్ల నీళ్లు తిరిగినయ్... వార్త చదువుకుంట చాయ్ తాగుదామని గిలాస పట్టుకున్నాడు... గప్పుడే అండ్ల ఈగవడ్డది. ఏదో నాశిన గాలం మొదలైందని మనసు కీడు పలికింది.

వరద కాలువ కోసం ఏడు ముంపు గ్రామాలు - త్వరలో సర్వే

బుచ్చిరెడ్డి వణుకుతున్న చేతుల్తో వార్త చదివిండు.

'మిడ్ మానేరు రిజర్వాయర్ నిర్మాణం తల పెట్టిన ప్రభుత్వం ఆ ప్రాంతంలోని కొదురుపాక, రుద్రవరం, వదరవెల్లి, విలాసాగర్, నర్సింగాపూర్, సంకెపెల్లి, శభాష్‌పెల్లి గ్రామాలు ముంపుకు గురవుతాయని తేలింది. ఎస్సారెస్పి డ్యామ్‌కు లోతట్టు ప్రాంతంలో ముప్కార్ గ్రామం వద్ద హెడ్ రెగ్యులేటరీ ఏర్పాటు చేసి అక్కడి నించి వరదకాలువ ద్వారా మూడు జిల్లాలకు సాగునీరందించాలని 550 కోట్లతో తొలి అంచనా వేసారు. ఫలితంగా భూసేకరణలో పై గ్రామాలు ముంపుకు గురికాబోతున్నాయి..."

బుచ్చిరెడ్డి మిగతా వార్త చదువలేకపోయిండు. కోడిని హోటల్లనే మర్సిపోయి పేపర్ పట్టుకొని బిరాన బిరాన ఊర్లెకు నడిసిండు. కాళ్లు తడబడ్డాయ్...

నలుగురైదుగురు రైతులు కనవడంగనే "నోట్లె మట్టిగొట్టిండ్రు బిడ్డా..."

అని ఏడ్సుడు మొదలువెట్టిండు.

చుట్టూత జనం మూగింద్రు... మత్‌లబేందే బుచ్చన్నా అనుకుంట పేపర్ ఇగ్గుకొని చదివింద్రు... అందరి మనసులు అగులు బుగులైనయ్... గుడ్లల్ల నీళ్లు దప్ప నోటంట మాటలు రాలె...

పురాత్తిగ తెల్లారింది....

మంద మీద తోడేలు వడ్డట్టు... ఊరు ఊరంత ఆగమైంది.

కచ్చీరు దగ్గర అయిదారు వందల మంది జమైంద్రు... అంత లొల్లిలొల్లి.. ఎవలేం మాట్లాడుతుంద్రో అర్థమైతలేదు. ఓరుగంటి నర్సవ్వ గుండెలు బాదుకుంట ఉరికివచ్చింది. ఆమె భర్త మస్కట్‌ల చనిపోయి ఆర్నెల్లయింది. శవపేటికతోని పంపిన లక్ష రూపాయల్లోని రెండెకురాలు కొనుక్కుంది. మొఖం మీద కొంగేసుకొని శోకం బెట్టింది నర్సవ్వ.

నా అయ్య నువ్వెకడవోతివిరో... నాలయ్యా...

నా అయ్య మమ్ముల్నన్న కొంటవోకపోతివిరో... నా అయ్యా...

నా అయ్య నువ్వు అర్వకట్టం జేత్తువే... నా అయ్యా...

నా అయ్య నా కొడుకులు రత్నాలన్నవే .... నా అయ్యా..

నా అయ్య ఊరుమునుగుతుందట్నే... నా అయ్యా...

నా అయ్య సంటిపోరగండ్లనేసుకోని నేనేడవోదునే... నా అయ్య...

నా అయ్య గుంటశిక్కులు దెల్వందాన్నే... నా అయ్య...

నా... అయ్యా..."

"ఓ నర్సీ... ఊకోయే... నీ ఒక్కదాని ఇల్లే మునుగుతుందానే... ఊరే మునుగుతదట" పట్వారి గంగన్న గయ్‌మన్నడు. పట్వారికి లోపల సంబురంగున్నది.

దొర భూమి కొందామనుకున్నోడే... ఎందుకో జగిత్యాల కాడ ఇల్లు కొనుక్కున్నడు. గదే మంచిదైంది. ఆల్ల కట్టం జూత్తె కైతికాలాడబుద్దయింది పట్వారికి.

"నీకేమైందోయ్ అబ్దుల్లా... రందిగున్నవ్. నీకేమన్న ఊర్లె ఇల్లుందా... ఊరవతల జాగుందా" అన్నాడు ఎటకారంగా.

"గదికాదు పట్వారీ... పీర్ల కొట్టం కాడ అటుకుమీది సందుగులున్న పీరీలు మాయమైనయ్. లాల్చవ్వ పీరి కనవడ్తలేదు" చెప్పిండు బాధగా.

"ఊరే నీల్లల్ల పడ్తంది. నీ పీరీలకచ్చిందా... ఇగ బోల్లబోకెలు నెత్తినవెట్టుకొని అస్సోయిధూల అనుకుంట ఉరుకుడే తియ్..." అన్నడు నవ్వుకుంట

ఆ మాటలిన్న ఓ రైతు కోపంగ అన్నడు.

"గట్లనే ఉంటది పట్వారి... పల్లెమునిగిన పట్వారోడు తేల్తడని వట్టిగనే అన్నరా... నీకేంది ఒడ్డుమీదున్నవ్" ఆ మాటతోని పట్వారి జారుకున్నడు. పోతున్న పట్వార్ని జూసుకుంట 'ఈని లత్కోర్ మొకంల నా చెప్పు' అని తిట్టిండు.

పొద్దు నిటారైంది... అయిన ఏం తేలలేదు. దొర గందుకే సుదురా యించిండని సమజైంది. బొండిగల జీగునం పోతున్నట్టయింది ఊరంతా... ఆకలి సచ్చిపోయింది. ఊరు పరాయిదైపోతున్నట్టనిపించింది...

ఒంటిగంటకు అందరు ఒక నిర్ణయానికచ్చింఁడ్రు.

"ఏడు గ్రామాలు ఏకం గావాలె... ఎల్లుండే కలెక్టరేట్ ముట్టడించాలే"

xxx xxx xxx

దాదాపు పన్నెండువేల మంది కచ్రాలమీద, టాక్టర్లమీద కలెక్టరేట్కి ఊరేగింపుగ వచ్చింఁడ్రు. నినాదాలతో, అరుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది.

అల్లకంటె ముందే అక్కడ వందమంది దాకా పోలీసులున్నరు.

కలెక్టరమ్మ బయటికచ్చినంక గొడవ సద్దుమణిగింది. తొక్కుడు మొదలైంది. వివరాలు తెల్సుకొని వినతిపత్రం తీసుకుందామె.

"ఎనభైవేల ఎకరాలకు సాగునీరందించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీనికి వరల్డ్ బ్యాంక్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం కూడా సిడబ్ల్యూసి క్లియరెన్స్ ఇచ్చింది. వెయ్యికోట్లతో చేసే పని ఇది. ఇలా అభివృద్ధిని అడ్డుకుంటే ఎలా? మీ ఏడు గ్రామాలు ముంపుకు గురికాక తప్పదు. భూసేకరణ చేసాక ఎకరాన మూడువేల నష్టపరిహారం చెల్లించాలని గవర్నమెంటు నిర్ణయించింది. వరదకాలువ నిర్మాణం తప్పదు. డెవలప్‌మెంట్‌ని అర్థం చేసుకోక ఇలా అల్లర్లకు దిగితే ఎలా? అని అచ్చీరాని తెలుగులో మాట్లాడి కార్లో వెళ్లిపోయింది.

జనం కోపం కట్టలు తెంచుకుంది.

కుర్చీలు టేబుల్లు ఎత్తేసింద్రు.. ఫైళ్లను చింపేసి కాకిరి బీకిరి చేసింద్రు... బీరువాలు కూలదోసింద్రు.. ఫ్యాన్లను ఇరగొట్టింద్రు...

ఎప్పుడు మీద పడదామన్నట్టున్న పోలీసోల్లు లాఠీలకు పనిజెప్పింద్రు.

తొక్కిసలాట... అరుపులు... ఉరుకులు... పరుగులు... గంట తర్వాత పల్లిచేను ఈటు వోయినట్టయింది కలెక్టరేటు. పత్రికలోల్లకు పరవాన్నం దొరికినట్టయింది.

తెల్లారి నుంచి... వూర్లెకి రాజకీయ నాయకులచ్చింద్రు... అదాలతోల్లచ్చింద్రు. భూపోరాటమోల్లచ్చింద్రు... అద్వకేట్లచ్చింద్రు... అన్నలచ్చింద్రు... పేపరోల్లచ్చింద్రు... ఊరు గారెడోడు అంగట్ల కట్టేసిన ముంగిస పిల్లలెక్క బెదురు బెదురుగా సూత్తంది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండడమే గగనమైతుంటే వరదనీటితో వరద కాలువ ప్రాజెక్టులెలా కడతారో, కట్టి లాభమేందో ఎవలకర్థంగాలె... చెవిటోని ముందు శంకూదినట్టయింది.

వారం తిరిగే సరికి... సర్వేలు చేసుటానికి సామాన్లతోని ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు దిగిండ్రు.

అది తెల్సి ఆడోల్లు కొడవండ్లు తీసిండ్రు... మొగోల్లు గుత్పలు ఎత్తిండ్రు... పిల్లలు రాళ్లు పట్టిండ్రు...

అప్పటి మందం సర్వే ఆగిపోయింది... గిట్ల నాలుగుసార్లయింది.

xxx xxx xxx

ఎర్రబస్సు ఆగంగనే... బాధగా ఎక్కిండ్రు నలుగురైదుగురు యువకులు. కిందున్నోల్లంతా తలోమాట చెప్తుండ్రు.

"పైలం బిడ్డా... ఏగి తిరుగకు... ఎవ్సం పని తప్ప ఏ పని రానోనివి... ఎట్లుంటవో నీ కాల్మొక్త బిడ్డా..."

అందరి నోటి నుంచి గవ్వే బాధలు... బస్సుల కూసున్నోల్ల కండ్లల్ల నీళ్లు తిరిగినయ్... మొఖాలు సూడలేకపోతుండ్రు... అయినా తమాయించుకొని ఓదార్చిండ్రు.

"ఏం రంది పెట్టుకోకుండ్రి... ఫోను జెత్తం... వూర్లెకచ్చెటోల్లందరి మాటలు నమ్మకుండ్రి... ఎక్కడ పడితే అక్కడ సంతకాలు పెట్టకుండ్రి..."

బస్సు కదిలింది....

కరెంటుపోలుకి ఒరిగి దాన్ని జూసుకుంటనే బీడీ తాగుతుండు సత్తయ్య...

పత్తి పురుగు తొలిచినట్టు బాధ తొలుత్తాంది. పొద్దాటి కల్లు తాగవోదామన్న మనసున వడ్తలేదు.

"ఏందే సత్తన్నా... ఇరాం లేకుంట, కండ్లు గిలుపకుంట సూత్తన్నవ్... నీ కొడుకుని గూడ భీవండి పంపుతావా ఏందే..." అనుకుంటచ్చిండు బుచ్చిరెడ్డి.

"అదికాదే బుచ్చన్న... దగ్గరయ్యేటోల్లు గూడ దూరం గావట్టె అని బాధ" అన్నడు సత్తయ్య.

"ఏంటిదే.. తెల్లగోలుగ జెప్పరాదు"

"ఏం జెప్పాలె... ఇంట్ల మీ వదినే ఒకటే ఏడ్తుంది. మా వేణుగాడికి చిల్వకోడూర్ సంబంధం ఖాయమైంది తెల్సుగదనే... ఆల్లిప్పుడు మీరద్దు... మీ సంబంధం వద్దంటుండ్రు."

"ఏమైందే... మీరు పూలుసండ్లు పెట్టత్తిరి... ఆల్లచ్చి వరపూజ గూడా జేసిరి... ఇరవై వేలు పోసిండ్రని చెప్తివి గద"

"అంత మంచిగనే అయిందే, వేణుగాడు కరెంటు మోటార్ల మెకానిక్ చేత్తడని, ఇంతిల్లుండే అయిదెకురాల భూముండే అని ఆల్లుగూడా సంబురపడ్డరు. గిప్పుడు ఊర్లు మునుగుతదని ఎవ్సం ఎవలు జేత్తరు? ఎవ్సం లేకపోతే కరెంటు మోటార్ల పనేడుంటది? ఇల్లు భూమి అంత మునిగితే మా పొల్లనెట్ల సాత్తరు? మీ సంబంధం వద్దంటుండ్రు... గదే మనసున వడ్తలేదు" అన్నడు బాధగా.

"మరి పెట్టువోతలన్నయినై గాదె..." బుచ్చిరెడ్డి అడిగిండు.

"నీ... మీ వూరి సంబంధమే వద్దంటుండ్రంటె పెట్టువోతలకచ్చిందా... ఇరవైవేలు వాపసిచ్చినం" బీడి నలిపేసుకుంట చెప్పిండు.

"వూరికేదో లత్త గొట్టిందే సత్తెన్నా... మొన్నటిదాక మంచిగుంటిమి.

గిట్లయిపోవట్టె బాధని పంచుకున్నడు బుచ్చిరెడ్డి.

"నలుగుట్లె నల్లమొకం కాదె... మీ వదినె ఏడ్పు సూడలేక బజార్లవడ్డ... వేణుగాడు సుత 'పోనియ్యే బాపు' అంటుండు గాని లోపలెంత బాధున్నదో... మన వూరికి ఎవడు పిల్లనిచ్చెటట్టు లేడు. చేసుకునేటట్టు లేడుగదనే"

"చెప్తున్న గద... ఊరు కడదప్పింది. పిల్లి వట్టిన కోడికన్న అద్వాన్నమైంది.

రేపే సచ్చెటోనికి ఎవలు సింగారిత్తరన్నట్టు కనవడతంది కొత్తిండ్లు కట్టుడే లేకపోయె... ఉన్నిండ్లు కూలవట్టె... పట్నాల పొంట పోదామని సదురుకోవట్రి... ఏవన్న ఇంపుగున్నదా... ఎప్పుడచ్చి సర్వే జేత్తరోనని ఎవ్సాలు మూలవడె... పెంట పొనకలిరిగిపాయె... వడ్ల బోరాలు ఎలుకలు కొరకవట్టె... పాత గుమ్మిలకు చెదలు పట్టె... వడ్లదాతి మీద దుగోడ సప్పుళ్లు ఆగిపాయె.. కొలిమిల మంటల్లేక పాయె... ఊరంత సర్కార్‌తుమ్మలు మొలువవట్టె... కాటి పాపలోడు గంట నూపినట్టె అయిపాయె..." బుచ్చిరెడ్డి కండ్లల్ల కూడా నీళ్లు తిరిగినయ్.

అప్పుడే గుడ్డిపోతడు ఎగవోసుకుంట పోతుంటే "ఏమైందిరా పోతా... ఎటో ఉరుకుతున్నవ్" అనడిగిండు బుచ్చిరెడ్డి.

"గా రేవెల్ల భూమన్న ఇల్లు కూలిందట్నే... ఆల్ల అయ్య సచ్చిపోయిండట" అన్నడు పోతడు.

"గట్లెట్లయిందిరా... గప్పట్లనే పాపం భూమన్న బెంగుళూరు గూన కప్పిత్తనన్నడు గీ ముంపొకటచ్చే... ఇగ కప్పిచ్చి పాయిదేందని ఆగిండు" అన్నడు బుచ్చిరెడ్డి.

"కావచ్చు గని... మూలవాసం ఇరిగి ముసలోడు చచ్చేపోయిండట. ఇంక నాలుగేండ్లన్న బతికెటోడు. జీవగంజికి గంతె బాకిలవడ్డడు" అనుకుంట పోతడు

పోయిండు.

"పోదాం రాయే సత్తెన్న... గీ ముంపుపాడుగాను.. భూముల్ని ముంచేత్తది అనుకున్నం గని బతుకుల్ని గూడా ముంచుతుందే... మనసు కలికలి అయితంది. భూమన్న దగ్గర పైసలున్నయో లేవో... రేపు గుంటుకల కొమురయ్య బిడ్డది విడాకుల పంచాయితుంది. గా దడువతు పైసలు నా దగ్గర్నే పెట్టింద్రు. ఎవలసవరం ఎట్లుంటదో రాయే పోదాం.' అన్నడు బుచ్చిరెడ్డి.

ఇద్దరు కదిలింద్రు.

xxx xxx xxx

కచ్చీరు దగ్గర పంచాయితి జోరుగ నడుత్తంది.

అటోల్లు ఇటోల్లు పెద్ద మనుషుల దగ్గర చెరి అయిదు వందల దడువతు పెట్టింద్రు.

అది విడాకుల పంచాయితి.

గుంటుకుల కొమురయ్యకు ఒక్కతే బిడ్డ. రుక్కవ్వ సూడ సక్కగుంటది. కొడుకుల్లేరు. జగిత్యాల నుంచి ఇల్లుటం దెచ్చుకున్నడు.

రుక్కవ్వ అందం... కొమురయ్య ఆస్తి జూసి పరంధాములు ఇల్లరికం అల్లుడిగా వచ్చిండు. ఏడాది సంసారం చేసినంక... ఊరు మునుగుతది అనంగనే విడాకులంటండు. పది మంది పెద్దమనుషులైతే అరవైమంది పంచాయితి వినుటానికచ్చింద్రు.

ఓ పక్క దీనంగ కొమురయ్య, భార్యశాంతమ్మ, బిడ్డ రుక్కవ్వ కూచున్నరు. ముసలోల్లకు బరివద్ద బొక్కలు దేలినయ్. పరంధాములు ముల్లెవోయిన సేటు లెక్కనే కూసున్నడు... వాదిస్తండు.

"నేను సావురాక ఇల్లుటం అచ్చిన్నా... లక్ష రూపాయలు నెట్టిత్తమని గొల్లపెల్లి నుంచి సంబంధాలచ్చినయ్... శ్రీరాములపల్లె నుంచి అచ్చినయ్... చిలాకోడూర్ నుంచి అచ్చినయ్... చర్లపల్లె నుంచి అచ్చినయ్... అయినాగాని... ఈల్లకు ఇల్లు, భూమి మంచిగుందని ఆశపడే అచ్చిన... గదంత మునిగి పోయినంక నేను ఇల్లుటమచ్చి పాయిదేంది? నాకు రుక్కవ్వద్దు..." అన్నడు.

"పొల్లగాడు తెగేసి చెప్తండు... నువ్వేమంటవే కొమురన్నా..." అనడిగిండు పంచి బుచ్చిరెడ్డి.

"ఏం తక్కువ చేసినమే... సాలు సంసారం చేసినంక పోరి బతుకేంగావాలె. మీరే జెప్పుండ్రి." కొమురయ్య అన్నడు.

"ఊరు మునుగుతదని మేం కలగన్నమా... పొల్ల బతుకు గత్తరమింగినట్టు జేత్తారే... ఎట్లనన్న జేసి దాని సంసారం నిలవెట్టుండ్రి. మీకాల్లు మొక్కుతా" అంది శాంతమ్మ.

"పరందాములూ... పైస కోసం పెండ్లాన్నిడిసిపెడ్తవా... పైస పాడుగాను... ఇయ్యాల్లత్తది రేప్పోతది. సోచాయించరాదు... " అన్నాడో పంచు.

"మీరెన్ని జెప్పిన నేనిన... నాకు విడాకులిప్పియుండ్రి" అన్నడు కోపంగా. గుంపులోంచి ఆడోల్ల ముచ్చట్లు నిష్టూరంగా... నిర్వేదంగా...

"జయితాల పట్టె పోరగాండ్లకు మందలియ్య వశముండది. పెండ్లిల్ల ఏదిచ్చినా ఇయ్యకున్న బండి కావాలంటరు.. ఈడు గూడ మూతినాకుడోడె..." అంది శాలోల్ల రాజేశ్వరి తప్పిపోయిన పెండ్లి సంబంధాన్ని గుర్తుజేసుకుంట.

"లింగులిటుకని ఇద్దరాలుమొగలు మంచిగనే తిరిగిండ్రు.. ముంపుకగ్గి తగుల రుక్కవ్వ సంసారంల నిప్పులు పొయ్యవట్టె..." అంది చాకలి దుబ్బవ్వ.

"లగ్గంల మైలపోలు తియ్యంగ ఎవడు తుమ్మిండో... పోరి బతుకు గిట్లగావట్టె" అంది భాగ్యమ్మ.

పెద్ద మనుషుల వాదోపవాదాలు జోరుగా నడుస్తున్నయ్. ఎవరి ముచ్చట్లల్ల వాళ్లు పడ్డరు. ఒకరిద్దరు పంచులకైతే పంచాయితి జెల్దిన ఖతమైతె దడువతు పైసల్తోని తాళ్లల్ల పడొచ్చు అని శెడ యాష్టకత్తుంది.

"పెండ్లిల పెట్టినయన్ని పోసుకుంట పదివేలు ఎదురుకట్న మిస్తనంటున్న కదా... గిదేం పంచాయితి... మీరేం పంచులు" అని కోపంగా లేసిండు పరంధాములు.

"ఏందోయ్... పెద్దంతరం చిన్నంతరం లేకుండా మాట్లాడుతున్నవ్... గిదేనా మర్యాద" కోపంగా అన్నాడో పెద్ద మనిషి.

"ఆని తలపుండ్లు కడుగ... ఆనికి కట్నమెక్కువ పోత్తమని ఎవలు తొందర పెడ్తుండ్రో" జనంలోంచి ఎవరో కోపంగనే కారెడ్డమాడిండ్రు.

రుక్కవ్వ తండ్రివైపు చూసి... కళ్లనీళ్లతో అసహాయంగా తలూపింది. 'నాయిన్నా విడాకులే ఇప్పించుండ్రి" అన్నటు..

అది అర్థం చేసుకున్న కొమురయ్య "ఇగ గట్లనే కానియ్యుండ్రి, ఏం జెయ్యాలె దాని నశీబు గట్లున్నది" అన్నడు.

"పెండ్లిల్ల ఏమేం పెట్టిండ్రే శాంతవ్వ" అడిగిండో పంచు.

శాంతవ్వకు మాటలు రాలేదు. దుఃఖం పొంగుకత్తాంటె నోటికి కొంగు అడ్డం పెట్టుకుంది. ఓ పెద్దమనిషి లిస్టు రాయాలన్నట్టు "ఏమేం పెట్టిండ్రంటె చెప్పవేందే" అన్నడు.

"అయిదు తూలాల నానుతాడు... తులం నల్లపూసల గుండ్లు.. అద్దతులం

కమ్మలు... దీలకిచ్చిన సైకిలి... మూడు తులాల వెండి బాసింగాలు... పైడి ముడిసిన కాడ పావులెత్తు బంగారం... అలుగవోయిన కాడ అయిదునూర్లు... నాగవెల్లి బట్టలకు అయిదు నూర్లు... ఇయ్యపురాలి వాయినం కింద వెయ్యి... గంగాళం... కొప్పెర... అచానక్ విజా దొరుకుతుందంటె మస్కట్ ఏజెంటుకు ఇరవైవేలిచ్చినం...” అని చెప్పింది.

పంచులు అద్దగంట లెక్కలు జేసింద్రు... కాయిదాలు రాసింద్రు. పరంధాముల్ని రుక్కవ్వని పిలిచి సంతకాలు చేయించింద్రు...

చెరో కట్టె పుల్లనిచ్చి 'ఇరువుండ్రి' అన్నరు.

పరంధాములు పుటుక్కున ఇరిసిండు... రుక్కవ్వకు ఇరువ ధైర్నం రాలేదు. కడుపుల్నించి దుఃఖం కదిలచ్చింది. ఏడ్సుకుంట... పరంధాములు మొకమ్మీద కాండ్రకిచ్చి ఊంచింది. “థూ... బట్టెబాజోడా... గోవసోంటోనివనుకున్న. గిట్ల పైసకు పెయ్యదింటవనుకోలే. నీకేం తక్కువ జేసిన... నువ్వెప్పుడత్తవోనని బీడీలు చేసుకుంట గలుమల కూసుండేదాన్ని... నీకిట్టమని రాములుక్కాయల కూరజేసేదాన్ని. గింత తక్లీబోనివనుకోలే... కట్టమో నిట్టూరమో సంసారం జేసిన. దొంగతనం జెయ్యలె... లంజెతనం జెయ్యలె... మస్కట్ శంకరిగాని పెండ్లామెనుక నువ్వు జన్నెకిడిసినోని లెక్క తిరిగచ్చినా నా అవ్వయ్యకు చెప్పుకోలె... నువ్వు సత్తెనాశినం సావట కొట్టమైతవ్...” అని పుల్లిరిసి అయిదు దోసిల్ల మన్నువోసింది.

తలకాయ కొట్టుకుంట, ఏడ్సుకుంట కూలవడ్డది.

తీర్పు చెప్పిన బుచ్చిరెడ్డికి బాదేసింది.

రుక్కవ్వ శాపనార్థాలు ఎవలికి తాకాలె... పరంధాములుకా.. సర్కార్కా... వరల్డ్ బ్యాంక్కా...? ఈని వరల్డ్ బ్యాంక్ పాడుగాను... దావతోడు గావు పిల్లను

కొరికినట్టే చేయ్యవట్టె' అనుకున్నడు రుక్కవ్వను ఊకుంచింద్రు.

ఆడోల్లందరు ఊగిపోయింద్రు... మగజాతినే తిట్టింద్రు...

"మొగోని కాపురమంత దాన్ని జూసుకునే... నీయవ్వ... ఈలపీట వట్టి నరుకుతే తెల్తది. ఇంకోదాన్ని చేసుకోకుంట... " మోటుగానే అంది నడివయసు జానవ్వ.

పరంధాములు కొంచెం జెనికిండు.

ఇంకా తిట్టెటోల్లె... ఓ పొల్లగాడు ఉరికచ్చి చెప్పిండు.

"సుద్దాల రాయమల్లు మందు తాగిండట" అని

ఊరంతా పంచాయితి కాన్నించి రాయమల్లు ఇంటికి పరుగులు తీసింది. దొర భూములు కొనంగ దెచ్చిన అప్పుతీర్చమని అప్పిచ్చిన కరీంనగర్ ఫైనాన్సోల్లు తిట్టిపోయింద్రట.

భూములు మునగవట్టె... అప్పెట్లదీర్చాలె అని తిమ్మెటగోళీలు మింగిండట. అడ్డికి పావుశేరు అప్పుదెత్తె రాయమల్లు పాణాలు దీసుకునె... మన గతేందని ఇంకొందరికి బుగులు పుట్టింది.

రాయమల్లు శవాన్ని జూసి ఊరు పుట్టెడు శోకమైంది. భార్యాపిల్లలు శవం మీద పడి గోడుగోడున ఏడ్తంద్రు. ఆ ఏడ్పులింటె గుండెలు తరిత్తలేవు. రాయమల్లు తల్లి సోయి తప్పింది. అది జూసి ఏడ్వనోల్లు పాపాత్ములయింద్రు.

"పొద్దు గూట్లె పడుతుంది. ఎంతేడ్సిన రాయమల్లు లేసొత్తడా... పాడె గట్టుంద్రి" అన్నడు బుచ్చిరెడ్డి.

డడ్డన్‌కడం... డడ్డన్‌కడం.... డడ్డన్‌కడం...

రెండే డప్పుల సప్పుడు... సావు సప్పుడు... గుండెల్ని పిండే సప్పుడు... పాడెనెత్తింగ్రు... వూరంత ఏడ్సుకుంట నెత్తికొట్టుకుంది.

ముగ్గురితో పాటు పాడెనెత్తుకున్న బుచ్చిరెడ్డి భుజం కలుక్కుమంది. కలెక్టరేట్‌ల పోలీసోడి లాఠీదెబ్బ పడ్డనాటి నుంచి భుజం సలుపుడు తగ్గుతలేదు.

కలెక్టరమ్మ మాటలు యాదికచ్చినయ్.

'వరల్డ్ బ్యాంక్ ఆమోదం తెల్పింది. కేంద్ర ప్రభుత్వం సిడబ్ల్యుసి క్లియరెన్స్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సర్వే జేసింది. అని..

నీయవ్వ... ఎక్కడి వరల్డు బ్యాంకు... ఎక్కడి రాయమల్లు శవం... అనుకున్నడు మనసుల.

శవం తరలిపోయింది.

మానవ సంబంధాల్ని బలవంతంగా తెంపేస్తున్న ఆధునికాభివృద్ధి మనుషుల్ని బలితీసుకునేదాకా వదుల్తలేదనుకుంట సురీడు గూడా కుంగిపోయిండు.

xxx xxx xxx

ఊరు అవుటాఫ్ రోగం (ఎయిడ్స్) వచ్చినోని లెక్క దినదినాం నిర్జీవమైపోతుంది. శిథిలమైపోతుంది.... చిన్నాభిన్నమై పోతుంది...

ఓ రోజు ఊరంత కరపత్రాలు పంచుకుంట రెండు కార్లు తిరిగినయ్.

"కరీంనగర్ పక్కన, చింతకుంట శివార్లల్ల తొమ్మిది వందల ప్లాట్లు పెట్టినం. గుంటకు పదివేలు. ఒక్కో ప్లాటు రెండు గుంటలు. త్వర పడండి" అని ప్రచారం చేసారు.

ఊర్లో సగానికెక్కువ ఇరవైవేలు ఎట్లనన్న జేసి కొనుక్కోవాలె అని

నిర్ణయించుకున్నరు. కొందరు ప్లాట్లు చూసొచ్చి సిటీకి దూరమైనా మంచిగున్నయ్ అన్నరు. ఏడు ముంపు గ్రామాల్నించి కొన్ని వందల కుటుంబాలు మెల్ల మెల్లగా పోవాలని డబ్బు కట్టినయ్.

కోటి ఎనభై లక్షలు !

హైదరాబాద్‌ల కూసుండి... డబ్బు చూసుకుంట అచ్యుతరావ్ దొర నవ్వుకున్నడు. మందు కొట్టుకుంట మనసుల అనుకున్నడు.

"ఎప్పటికైనా ఏడు గ్రామాలోల్లు ఎటువోతరు అని అంచనా వేసిన... చింతకుంట శివార్ల చేండ్లు చెలకలు కొని గిప్పుడు ప్లాట్లు వెట్టిన. ఆల్ల పైసలు ఆల్ల నెత్తిల్నే పెట్టి యాడాదిల మూడింతలు జేసిన... అని నవ్వుకున్నడు.

దొరకి 'కప్పతల్లి' యాదికచ్చింది. ఎవల కడుపు నిండింది? ఎవల దొడ్లు నిండినయ్ అని నవ్వుకున్నడు.

**ఇప్పటికీ... ముంపు గ్రామాలకు నీళ్లు రాలేదు.**

**అయినా ... ఊరు నిండ మునిగింది??!!!**